## క్లుప్తంగా

### శ్రమదానం



మంచినీటి ట్యాంకులోకి దిగి శుభ్రం చేస్తున్న యువత

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామంలో యువత స్వచ్ఛందంగా శ్రమదానం చేసి, మంచి నీటి పథకాన్ని ఆదివారం శుభ్రం చేశారు. సర్పంచ్ కొరగంజి సాయిరాం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు మంచి నీటి ట్యాంకులోకి దిగి బ్లీచింగ్ పౌడర్‌తో ట్యాంకును పరిశుభ్రం చేశారు. గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు అందేలా యువకులు చేసిన ఈ మంచి పనిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

### భగవన్నామస్మరణతోనే మోక్షం



కార్యక్రమంలో పాల్గొన్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం లభిస్తుందని ఆధ్యాత్మిక వక్తలు జద్దు జగ్గారావు, రామశేషు తెలిపారు. మండల కేంద్రంలోని దత్త పీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యం నాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక జ్ఞానబోధ సభ ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భగవంతుని నామాన్ని నిత్యం స్మరిస్తూ ఉంటే పాపాలు తొలగిపోతాయని, దుఃఖాలు దరిచేరవన్నారు. మనిషిని తరింపజేసేది తారకమంత్రమేనని, ప్రతిఒక్కరూ భగవంతుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, పండిత నాగేశ్వరరావు, భాష్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాల ఏర్పాటు



ఆలయ ప్రహరీపై విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రాజాం: పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయం వద్ద విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలు ఆదివారం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రహరీ గోడపై వాటిని వరుస క్రమంలో అమర్చారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వాటిని ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్తా శ్రీనివాసరావు, సీమకుర్తి ప్రసాద్, కొల్లా పార్థసారధి, రామ్‌కుమార్ వత్సాలు తెలిపారు. ఆలయ అర్చకులు పీసపాటి సూర్యనారాయణ స్వామి, రవి స్వామి, శ్రీనివాసరావుస్వామిలు ఈ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు.

### వరి సాగులో సస్యరక్షణ



రేగిడిలో వరి పంటపై పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతులు

రేగిడి: వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లోని పంటపొలాల్లో పండిస్తున్న వరి పంటకు తెగుళ్లు, చీడపీడలు సోకకుండా రైతులంతా పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. మరోవైపు పంట మధ్యలోని గాబు(పిచ్చిమొక్కలు) తొలగిస్తున్నారు. అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంటలకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్న సలహాలు, సాగు పద్ధతులను రైతులు పాటిస్తున్నారు.

### యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



దొంగురువలస వద్ద తరలించేందుకు ట్రాక్టరులో సిద్ధం చేసిన కలప

బొబ్బిలిరూరల్: మండలంలో కలప రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. ముఖ్యంగా ఇక్కడి గిరిజన ప్రాంతాల నుంచి కలపను అక్రమార్కులు తమ ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. దీంతో నారాయణవనం తదితర ప్రాంతాల్లోని అటవీ భూముల్లో ఉన్న విలువైన కలప సంపద రోజురోజుకూ మాయమైపోతోంది. మండలంలోని దొంగురువలస, కాశిందొరవలస పరిధిలో పలు ట్రాక్టర్లతో గుట్టుచప్పుడు కాకుండా కలప తరలిస్తున్న దృశ్యాలు ఆదివారం కనిపించాయి. ఆయా ప్రాంతాల్లో కలప దుంగల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లను ఆపి, కలప రవాణాపై పలువురు ప్రశ్నించగా, అదంతా తమ ఓనర్ చూసుకుంటాడని బొబ్బిలిలోని మిల్లుకు తరలిస్తున్నామనే సమాధానం రావడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంత కలప అక్రమంగా రవాణా జరిగితే అటవీ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ కలప రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

# రాజాంలో రియల్ దందా!

పచ్చని పొలాలుగా కళకళలాడాల్సిన పంట భూములు రియల్ ఎస్టేట్ దందాకు అడ్డాలుగా మారుతున్నాయి. ఎక్కడికక్కడ అక్రమంగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. సెంట్లు, గజాలు లెక్కన వ్యాపారులు వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అనుమతులు లేకుండా జరుగుతుందని తెలిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- ముందస్తు అనుమతులు లేకుండా లేఅవుట్‌ల ఏర్పాటు
- విచ్చలవిడిగా పంటపొలాలను కప్పేస్తున్న వ్యాపారులు
- రాత్రి వేళలో జోరుగా గ్రావెల్ తవ్వకాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- దందా అడ్డుకోవాలని పలువురు విజ్ఞప్తి



రాజాం పట్టణ పరిధిలోని సారధి రోడ్డులో పంటపొలాల్లో వేసిన లేఅవుట్‌లు



మురుగుకాలువలు కప్పివేసి మరీ గ్రావెల్ వేస్తున్న దృశ్యం

రాజాం: పట్టణం సహా పట్టణ పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు కమర్షియల్ భూములుగా మారిపోతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూముల్లో లేఅవుట్లు వేసి, వాటిని ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు. లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన చేయకుండా అటు కొనుగోలుదారులను, కోట్ల రూపాయల నగదు ఆశచూపి ఇటు రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. రైతు తన భూమిని అమ్మినప్పుడు తొలుత కొంత మొత్తాన్ని ఇచ్చి, పొలాల్లో లేఅవుట్‌లు వేసి, వాటిని విక్రయించిన తర్వాతే మిగతా సొమ్మును రైతులకు ఇస్తున్నారు.

**ఒకే స్థలానికి ఇద్దరు, ముగ్గురికి రిజిస్ట్రేషన్..**

కల్టివేషన్ భూములను కమర్షియల్ భూములుగా మార్చాలంటే ముందుగా రెవెన్యూ అనుమతులు పొందాలి. లేఅవుట్‌లు వేసే ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు తగినంత స్థలాన్ని విడిచిపెట్టాలి. అవసరమైన మేరకు ముందుగానే డ్రైనేజీ నిర్మించాలి. అయితే రాజాంలో కొత్తగా వెలుస్తున్న లేఅవుట్‌లలో ఇవేమి ఉండడం లేదు. కమర్షియల్ అనుమతులు, నాలా చెల్లింపులు, ప్లాన్ అప్రూవల్ లేకుండానే సైట్లు తయారవుతున్నాయి. ఒకేచోట వందల సంఖ్యలో స్థలాలు చూపించి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలుదారులను మభ్యపెడుతున్నారు. తమకు నచ్చిన విధంగా ఏజెంట్లను పెట్టి, ప్రజలను మోసగిస్తున్నారు. స్థలాల రిజిస్ట్రేషన్ సైతం ఒక స్థలానికి సంబంధించి, ఇద్దరు నుంచి ముగ్గురుకు జరుగుతోంది. ఈ తంతు ఇటీవల కాలంలో అధికంగా జరగడం గమనార్హం. గతంలో కొంతమంది వ్యాపారులు ప్రజల వద్ద నుంచి డబ్బులు దండుకుని సైట్‌లు కూడా ఇవ్వకుండా ఉడాయించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు రాజాం చుట్టుపక్కల విపరీతంగా ఏర్పడిన లేఅవుట్‌లతో మళ్లీ అదే పరిస్థితి వస్తుందా అనే సందేహం వ్యక్తమవుతోంది.

**అనుమతులు తప్పనిసరి..**

కల్టివేషన్ ల్యాండ్‌ను కమర్షియల్ ల్యాండ్ చేయాలంటే తప్పనిసరిగా రెవెన్యూ అనుమతులు ఉండాలి. రాజాం పట్టణంలో అటువంటి లేఅవుట్‌లు వేస్తే ముందుగా మాకు దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడి నుంచి ఆర్‌డీవో దగ్గరకు అనుమతికి వెళ్లి ఆ తర్వాత అనుమతులు వస్తాయి. అనంతరం లేఅవుట్‌లు వేయాలంటే వుడా అప్రూవల్ పొందాలి. ఇవన్నీ జరగకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు.

– ఎస్.కె.రాజు, తహసీల్దారు, రాజాం

**రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు..**

రాజాం పట్టణంలో రాత్రికే రాత్రే పంటపొలాలను కమర్షియల్ ల్యాండ్‌లుగా మార్చేస్తున్నారు. సారధి, మొగిలివలస, అంతకాపల్లి, గాయత్రీకాలనీ, చీపురుపల్లిరోడ్డు, కంచరాం, బుచ్చింపేట తదితర ప్రాంతాల్లో పంటపొలాల్లో చాలా లేఅవుట్‌లుగా మారిపోతున్నాయి. ఇటీవల కాలంలో ఇక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరింతగా పేట్రేగిపోతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా పొలాల్లో రాత్రికి రాత్రే గ్రావెల్ వేసి, మొత్తం కప్పేస్తున్నారు. చెరువుల నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ అటు చెరువులను కూడా ప్రమాదకరంగా మారుస్తున్నారు. వ్యాపారుల దందాలకు అటు చెరువులు, ఇటు పంటపొలాలు పూర్తిగా ప్రమాదకర పరిస్థితిలోకి చేరిపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# జయహో.. దుర్గాభవానీ!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకో అవతారంలో దర్శనమిచ్చే దుర్గమ్మను చూసి తరించేందుకు భక్తజనం ఉవ్విళ్లూరుతున్నారు. ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో కనిపించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. జయహో దుర్గాభవానీ, దుర్గమ్మా.. కరుణించమ్మా.. నినాదాలతో పూజా ప్రాంగణాలు మార్మోగుతున్నాయి. పలుచోట్ల చేపడుతున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

–బొబ్బిలి, రాజాం



రామభద్రపురంలోని సాయినగర్ కాలనీలో పూజలందుకుంటున్న దుర్గతల్లి



రామభద్రపురం కూరాకుల వీధిలో దుర్గామాత వద్ద భక్తుల పూజలు



వంగర: రుషింగిలో పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలిలోని గొల్లవీధిలో శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన ఎల్లమ్మతల్లి



తెర్లాం: నందబలగ కనకదుర్గ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి



సంతకవిటిలోని తెలగవీధిలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



తెర్లాం: నందబలగ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి: పాతబొబ్బిలిలో కలశాలలతో మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్న మహిళలు



రాజాం సిటీ: కంచరాం ఎస్సీ కాలనీలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



రాజాం సిటీ: దోలపేటలో సహస్ర పారాయణం చేస్తున్న భక్తులు



బాడంగి ఉమాసోమేశ్వరాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా ఉమాదేవి అమ్మవారు దర్శనం



బాడంగిలోని యాదవ వీధిలో పూజలందుకుంటున్న దుర్గమ్మ



బొబ్బిలి: గొల్లపల్లిలో పూజలందుకుంటున్న దాడితల్లి



బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పూజలందుకుంటున్న దేశమ్మతల్లి



రేగిడి: లక్ష్మీపురంలో లలితాత్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ

## తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ



తూటికాడ కషాయం తయారీని వివరిస్తున్న సింహాద్రినాయుడు

వంగర: తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని సీతాదేవిపురం గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. వరి సాగులో కనిపించే సుడిదోమ తెగులు నివారణకు ఈ కషాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ రైతు తక్కువ పెట్టుబడితో తయారయ్యే ఈ కషాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో 25 ఎకరాల్లో ప్రకృతి సాగు విధానంలో పండిస్తున్న వరి పంటను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ఆదివారం పరిశీలించారు. ప్రకృతి సాగులో భాగంగా తయారయ్యే వివిధ కషాయాలను పంటలపై పిచికారీ చేయడం ద్వారా తెగుళ్లు, చీడపీడలు నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు కరణం గోవిందరావు, మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకుల పంపిణీ



నిత్యవసర సరుకులు అందిస్తున్న దృశ్యం

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో ఉన్న పలువురు పేదలకు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. అమృత కలశం పేరిట ఇక్కడి దివ్యాంగులు, పేదలకు నెలకు సరిపడ సరుకులు అందిస్తున్నట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీహెచ్‌వో సొంగ అప్పలనాయుడు, సేవాదళ్ సభ్యులు సాదెం వెంకటరమణ, సొంగ రాంబాబు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన రెండు దత్తత కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన యువకులు ఆదివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలో నిరుపేదలైన పెదపూడి ఇందుమతి, వడ్డి రాజులకు నెలకు సరిపడ సరుకులు అందించామని శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, బి.భాస్కరరావు, జి.గోవిందరావు తెలిపారు.

## బాధ్యతల స్వీకరణ



డీటీ చిన్నారావు

రేగిడి: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా ఎం.చిన్నారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గామాత ఆలయ ఇన్‌చార్జ్ ఈవోగా పి.శ్యామలరావు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఈవోగా పనిచేసిన శివకేశవరావును బాధ్యతల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఈవోగా వ్యవహరించిన పీవీ లక్ష్మి.. శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించారు. గత అనుభవం దృష్టిలో ఉంచుకుని నవరాత్రి ఉత్సవాలను సక్రమంగా జరిపించేందుకు గాను దేవదాయ ధర్మాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.



శ్యామలరావు

## పరామర్శ



లక్ష్మణరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్ తదితరులు

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన నల్లా లక్ష్మణరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, గాయాలపాయ్యారు. ఆయన పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దనే కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు ఆదివారం ఆయనను కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వంజరాపు విజయ్‌కుమార్, వంగా శ్రీనివాసరావు, వంగా రమేష్, కోండ్రు చిన్నప్పడు, ఓలేటి గణపతి, డాక్టర్ బి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, తదితరులు

రాజాం: పట్టణానికి చెందిన గ్రీన్‌బెల్ట్ కో–ఆర్డినేటర్, పెనుబాక యూపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఆర్‌వీజే నాయుడుని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆదివారం పరామర్శించారు. ఇటీవల నాయుడు తల్లి నారాయణమ్మ మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆదివారం ఆయన ఇంటికి చేరుకుని నారాయణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నేటినుంచి శిక్షణా తరగతులు

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సోమవారం నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఆదివారం తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ తరగతుల్లో తొలి దశలో తొలి రెండు రోజులు 13 పంచాయతీల వారికి, తర్వాతి రెండు రోజుల్లో మిగతా 12 పంచాయతీల వారికి శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ శిక్షణకు అందరూ హాజరై, తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## లక్ష బిల్వార్చన



పూజలు చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: దేవీ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని, స్థానిక పట్టణంలో 200 మంది భవానీ భక్తులతో లక్ష బిల్వార్చన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గురుస్వాములు బెహరా తవుడు, నంది సూర్యప్రకాష్‌ల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ అర్చకులు రాజీశర్మ శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

## పుస్తక పఠనంతో మేలు


తెర్లాం: ప్రతిరోజూ పుస్తక పఠనం చేయడం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని రిటైర్డ్ ఎంఈవో ఎం.సత్యనారాయణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో పుస్తక పఠనం ఏ విధంగా చేయాలి, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన తెలియజేశారు. పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం సంపాదించవచ్చన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కూడా శిక్షణ పొందాలన్నారు. లైబ్రేరియన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులంతా గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని, ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి, వార్తా పత్రికలు, కథల పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలను చదవాలని సూచించారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



పుస్తకం చదివిస్తున్న రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ

## వైద్య శిబిరానికి విశేష స్పందన

రామభద్రపురం: మండల కేంద్రంలోని చొక్కాపు వీధి రామమందిరం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చొక్కాపు వీధి యువత, లక్ష్మణరావు యువసేన ప్రతినిధులు చొక్కాపు రామ్‌సందీప్, చొక్కాపు రామ్‌చరణ్‌తేజ్‌ల ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైద్యులు శిబిరానికి హాజరైన 200 మంది రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఇద్దరికి కేన్సర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కాగా చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి రావాలని తెలిపి, ఉచితంగా చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.హరిజగన్(క్రిటికల్ కేర్ ఫిజీషియన్), ఎన్.అభినయ్(జనరల్ ఫిజీషియన్), ఆర్.ప్రత్యూష్(గైనకాలజిస్ట్), జె.సునీల్ (చిన్నపిల్లల వైద్యులు), సంజీవ్‌నాయుడు(జనరల్ ఫిజీషియన్), భార్గవి(దంత వైద్యులు) పాల్గొన్నారు.



రోగుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యులు

## నడిరోడ్లే.. ఆటోస్టాండ్‌లు..



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిపిన ఆటోలు



బాడంగి సెంటర్ వద్ద రోడ్డుపైనే ఆటో ఆపి, ప్రయాణీకులను ఎక్కిస్తున్న ఆటోడ్రైవర్లు

అంతరాష్ట్ర కూడలి అయిన రామభద్రపురం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆటోవాలాలు ఆటోస్టాండ్లుగా మార్చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణతో పాటు బాడంగి వెళ్లే సెంటర్, సాలూరు వెళ్లే జంక్షన్ తదితర ప్రాంతాల్లోని రోడ్లపైనే ఆటోలు నిలిపి ప్రయాణీకులను ఎక్కిస్తున్నారు. గంటల తరబడి అక్కడ వాహనాలు నిలుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. వాటిని కట్టడి చేయాల్సిన అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని పాదచారులు కోరుతున్నారు.

–రామభద్రపురం